ఎమ్మెల్సీ కవితకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకుడు సంపత్ రెడ్డి

టీబీజీకేఎస్‌ను మరింత బలోపేతం చేద్దాం

- యూనియన్ గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

రామగిరి, ఫిబ్రవరి 12:సింగరేణి కార్మికుల శ్రేయస్సు, భద్రతకు కార్మికుల పక్షపాతిగా ఉంటున్న టీబీజీకేఎస్‌ను మరింత ఐక్యతగా బలోపేతం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఆర్జీ-3 ఏరియా నాయకులతో బుధవారం ఎమ్మెల్సీ కవితను కలిశారు. ఈ సందర్భంగా ఆమె సింగరేణి ఏరియాలో కార్మికుల పరిస్థితులు, సంస్థాగత విషయాలపై చర్చించారు. ప్రస్తుతం గెలిచిన సంఘాలు కార్మిక హక్కులు, ప్రయోజనాలను విస్మరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో టీబీజీకేఎస్ హయాంలో అనేక ప్రయోజనాలు, వారసత్వ ఉద్యోగాలు పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. కార్మికులను చైతన్యపరుస్తూ హక్కుల సాధన కోసం విద్య, వైద్య రంగాల్లో మెరుగైన వసతుల కోసం ఐక్యంగా ముందుకు కదులుదామని సూచించారు. ఈనెల 23న జరిగే తన కుమార్తె వివాహ వేడుకకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్సీ కవితకు టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. నాయకులు పాశం శ్రీనివాసరెడ్డి, బోయినపల్లి శ్రీకాంత రావు తదితరులు పాల్గొన్నారు.

రంగరాజన్ మాటలు జ్ఞానోదయం కల్గించాలె

- రాజ్యాంగం అనుసరించే పని చేస్తున్నానని చెప్పడం గొప్ప విషయం
- వీరరాఘవరెడ్డి వెనక ఎవరున్నారో బయటపెట్టాలె
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మాట్లాడుతున్న పుట్ట మధూకర్

మంథని, ఫిబ్రవరి 12: భారత రాజ్యాంగంపై చిలుకూరి బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్ చేసి వ్యాఖ్యలు మేధావులకు జ్ఞానోదయం కల్గించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. చిలుకూరి బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌పై వీర రాఘవరెడ్డి దాడిని బీఆర్ఎస్, నియోజకవర్గ ప్రజల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నా రు. పట్టణంలోని రాజ గృహలో బుధవారం ఆయన మాట్లాడారు. దేశానికి సాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా ఇంకా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం గురించి తెలియక పోవడం బాధకరమన్నారు. ఎంతో మంది తాము మేధావులమని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. అలాంటి వాళ్లకు జ్ఞానోదయం కల్పించేలా పూజారి రంగరాజన్ తాను రాజ్యాంగం అనుసరించే పని చేస్తున్నానని చెప్పడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలోని అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఓ వైపు రాజ్యాం గం పుస్తకం పట్టుకొని తిరుగుతూ, ఆలయాలకు వ్యతిరేకం కాదని చెబుతూనే మరో వైపు అన్ని వర్గాల ప్రజలను హింసిస్తున్నారని విమ ర్శించారు. ఎంత సేపు కూల్చివేతలు, దాడులు, కేసుల పైనే దృష్టి పెడుతుందే తప్ప ప్రజల సమస్యలపై కాదన్నారు. వీర రాఘవరెడ్డి వెనుక ఎవరు ఉన్నారో బయటకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీర రాఘవరెడ్డి తనకంటూ ఒక ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసుకొని విద్వేషాలు సృష్టించి విధ్వంసం చేయాలనే ప్రయత్నాలను ఆలయ పూజారి రంగరాజన్ అడ్డుకునే ప్రయత్నం గొప్పదన్నారు. ఆయనకు అండగా ఉంటామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముం దు ఎలాంటి పరిస్థితులు ఉండేవో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అలాంటి పరిస్థితులే మళ్లీ ఏర్పడ్డాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజల సంక్షేమ గురించి ఆలోచన చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, కాయితీ సమ్మయ్య, కన్నూరి శ్రీశైలం, గజ్జల రాజిరెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంతు రవిదాస్‌కు నివాళి

భారతదేశాన్ని ఆధ్యాత్మికత వైపు నడిపించి మాదిగ వర్గంలోనే గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తిగా వెలుగొందిన సంతు గురు రవిదాస్‌కు మంథనిలోని రాజగృహలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బుధవారం ఘనంగా నివాళులర్పించారు. దక్షిణ భారతదేశ సమితి రవిదాస్ సంగటి సమన్వయకర్త కౌండిన్య శ్రీశైలం మహాదేవ్ ఆధ్వర్యంలో సంతు రవిదాసు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెద్దపల్లి ఏఎంసీలో పత్తి నిల్వలు

పత్తి కోనుగోళ్లు నిలిపివేసిన సీసీఐ

- సర్వర్ డౌన్ కారణమని చెబుతున్న అధికారులు
- ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం
- నష్టపోతున్న రైతులు

పెద్దపల్లి, ఫిబ్రవరి12: జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ 3 రోజులుగా పత్తి కొనుగోళ్లను నిలిపివేసింది. సీసీఐకి విక్రయించేందుకు తీసుకు రాగా, సర్వర్ డౌన్ అని పత్తి కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాలీ కిరాయి పెరుగుతున్నాయని విధిలేక ప్రైవేట్ వ్యాపారులకు మేలు రకం పత్తి క్వింటాలుకు రూ. 6,700 - 6,800 మధ్య విక్రయిస్తున్నారు. దీంతో క్వింటాలుకు దాదాపు రూ. 700 దాకా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో గతేడాది అక్టోబర్ ఒకటో తేదీన సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. ఈనెల 11 వరకు 2,80,644 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ప్రైవేట్ వ్యాపారులు 83,000 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు.

రూ. 100 తగ్గిన మద్దతు ధర

కేంద్ర ప్రభుత్వం ఈ యేడు పత్తి క్వింటాలుకు రూ. 7,521 ప్రకటించింది. తర్వాత పత్తి నాణ్యత తగ్గిందంటూ క్వింటాలుకు రూ. 100 కోతు పెడుతూ సీసీఐ రూ. 7421కి కొనుగోలు చేస్తున్నది. అయితే దళారులు గ్రామాల్లో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే పత్తిని సీసీఐకి విక్రయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. రైతులు నేరుగా తీసుకవచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయడానికి సర్వర్ సమస్యను చూపుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

సర్వర్ సమస్యతో కొనుగోలు నిలిపివేశారు

మూడు రోజులుగా దేశవ్యాప్తంగా సర్వర్ సమస్య ఉంది. ఆధార్ అథెంటికేషన్(మొబైల్‌కు ఓటీపీ) రాకపోవటం వల్ల సీసీఐ అధికారులు పత్తి కోనుగోళ్లు నిలిపివేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సర్వర్ సమస్య తీరగానే యథావిధిగా సీసీఐ కొనుగోళ్లు చేస్తుంది.

- ప్రవీణ్ కుమార్, డీఎంవో పెద్దపల్లి

క్వింటాలుకు రూ. 450 నష్టం

మాది సుల్తానాబాద్ మండలం పెరక పల్లి. రెండెకరాల్లో పత్తి సాగు చేసిన. ఇప్పటి వరకు అమ్మలేదు. దాదాపు 25 క్వింటాళ్ల పత్తిని సీసీఐలో అమ్ముకునేందుకు గొల్లపల్లి జిన్నింగ్ మిల్లుకు సోమవారం ట్రాలీలో తీసుకవచ్చిన. సర్వర్ పని చేస్తలేదని, ఎప్పుడు వస్తుందో? తెలియదని సీసీఐ అధికారులు తెలిపారు. మంగళవారం దాకా అగిన. ఆ రోజు కూడా సర్వర్ సమస్య ఉందని చెప్పడంతో రోజు రోజుకూ ట్రాలీ కిరాయి పెరుగుతున్నదని, పత్తిలో తేమ 8 శాతం ఉన్నప్పటికీ విధిలేక ప్రైవేట్ వ్యాపారికి క్వింటాలుకు రూ. 6950 చొప్పున 25 క్వింటాళ్ల మేలు రకం పత్తి అమ్మిన. దాదాపు క్వింటాలుకు రూ. 450 దాకా నష్టపోయిన.

-మేకల రామకృష్ణ, రైతు, పెరకపల్లి

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ఓదెల, ఫిబ్రవరి 12: ఓదెలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విజయరమణారావు బుధవారం పరిశీలించారు. పద్మశాలీ కుల సంఘ భవనం మరమ్మతు, చేనేత మగ్గాల ఏర్పాటు కోసం కమ్యూనిటీ హాల్ సందర్శన, తారకరామ కాలనీ నుండి డీ 86 ప్రధాన కాలువ వరకు గ్రావెల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. స్థానికులతో పనులు జరుగుతున్న తీరు, ఇతర ఇబ్బందుల గు రించి చర్చించారు. వెంట కాంగ్రెస్ నాయకులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, ఆకుల మహేందర్, చీకట్ల మొండయ్య, బోడకుంట చిన స్వామి, తీర్థాల వీరన్న, బోడకుంట నందన్న, రజనీకాంత్, రవిగౌడ్, కుమార స్వామి, వంగ రాయమల్లు ఉన్నారు

తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మడిపల్లి గ్రామస్తులు

బోగస్ ఓట్లు తొలగించాలని నిరసన

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి12: తమ గ్రామంలో నూతనంగా నమోదు చేసిన బోగస్ ఓట్లు తొలగించాలని కోరుతూ మడిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అడిగొప్పుల రాణి మోహన్ మాట్లాడారు. మడిపల్లిలో నివాసం ఉండని 30 మంది పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ గ్రామంలో వారికి 2024 డిసెంబర్ వరకు ఎలాంటి ఆధార్‌కార్డు , సొంత ఇల్లు లేదని, 131 పోలింగ్ బూత్‌లో 30 మంది బోగస్ ఓటర్లను జాబితాలో చేర్చారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బోగస్ ఓట్లు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకొని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ గ్రామస్తులు ఎండీ రఫిక్, ఫరీద్, గాజుల అజయ్, సూత్రాల శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, కల్లెపెల్లి రాజయ్య, శ్రీనివాస్, అడిగొప్పుల లింగయ్య ఉన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 12: ఆర్థిక సంవత్సరం ముగింపునకు సమయం దగ్గర పడుతుండటంతో ఆస్తిపన్ను మొండి బకాయిలపై నగర పాలక సంస్థ దృష్టి సారించింది. మార్చిలోపు వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లు సాధించాలనే లక్ష్యంతో నడుం బిగించింది. దీనితో బల్దియా రెవెన్యూ విభాగం అధికారులు స్వయంగా రంగంలోకి దిగి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించడానికి ముందుకు సాగుతున్నారు. నిత్యం పన్ను వసూళ్ల పురోగతిని నగర పాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ), స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ సమీక్షిస్తున్నారు. కాగా, బుధవారం నాటికి ప్రైవేటు ఆస్తుల ఇంటి పన్ను 53 శాతం, ప్రభుత్వ ఆస్తుల నుంచి 92 శాతం వసూలు కాగా, మిగతా బకాయిలు వసూలు చేయడానికి కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి నేతృత్వంలో నగర పాలక సంస్థ ఆర్వో ఆంజనేయులు, ఆర్ఐ శంకర్ రావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ స్వయంగా బకాయిదారుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. బకాయిదారులు తమ పన్నులను ఫిబ్రవరిలోగా చెల్లించకపోతే మార్చిలో చట్ట ప్రకారం ఆస్తులను జప్తు చేస్తామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. జప్తుల బారిన పడకుండా సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కోరుతున్నారు.

అహల్యబాయి స్ఫూర్తితో వీరవనితలు తయారు కావాలి

క్యాలెండర్లు విడుదలచేస్తున్న యవకులు

అంతర్గాం, ఫిబ్రవరి 12: మూడు వందల సంవత్సరాల క్రితం దేశంలో హిందుత్వం కోసం పోరాడిన శక్తి వంతురాలైన దీశాలి అహల్యబాయి హోల్కర్ అని, భవిష్యత్‌లో ఆమె స్ఫూర్తితో దేశంలో వీర వనితలు తయారు కావాలని సామాజిక సేవ కర్త లోకనాథం అన్నారు. అహల్యాబాయి త్రిశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని అంతర్గాం మండలంలోని పెద్దంపేట గ్రామంలో బుధవారం వాకర్సకు సమతా సదామూర్తుల పేరుతో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు. దేశం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తులైన అంబేద్కర్, వివేకానంద, కుమ్రం భీం, సావిత్రి బాయి పూలే, సంత్ సేవాలాల్ లాంటి మహనీయుల ఫొటోలతో ముద్రించిన క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కొలిపాక మధుకర్ రెడ్డి, పుట్ట శ్రీనివాస్, గంగారపు శ్రీనివాస్, కోల నారాయణ, మహిపాల్, గంగారపు తిరుపతి, కొలిపాక మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ తీస్తున్న అర్చకులు

అర్చకుడిపై దాడి అమానుషం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 12: అర్చకులపై జరుగుతున్న దాడులకులను ప్రతి ఒక్కరూ ఖండించాలని దూప దీప నైవేద్యం అర్చకుల సంఘం మండల అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాసచార్యులు కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ పిలుపు మేరకు బుధవారం కమాన్‌పూర్‌లో అర్చకులు ద్విచక్ర వాహనాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు.ప్రధాన అర్చకులు రంగ రాజన్‌పై జరిగిన దాడికి నిరసనగా అర్చకులు ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ.. అర్చకుల మీద దాడి అంటేనే సనాతన ధర్మంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు. సంఘం సభ్యులు శేషం సురేశ్ శర్మ, శేషం సతీశ్ శర్మ, గడియారం వేణు శర్మ, గడియారం మనోజ్ శర్మ, రామానుజం, హర్ష, వకులాభరణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నాయకుల అరెస్ట్

పోలీసు అదుపులో మున్నూరు కాపు సంఘం నాయకులు

జూలపల్లి, ఫిబ్రవరి 12 : కుల గణన సర్వేలో తమకు తీరని అన్యాయం జరిగిందని ఇచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘం నాయకులు తరలి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో జూలపల్లి, అబ్బాపూర్ గ్రామాల నుంచి కుల సఘం నాయకులను బుధవారం తెల్లవారు జామున అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక్కడ నాయకులు కొప్పుల మహేశ్, దండె వెంకటేశం, నాడెం శ్రీధర్, పసునూటి శ్రీనివాస్, బండి రాజయ్య, గుమ్మడి శంకర్, గోస్కుల ప్రసాద్, గాండ్ల హరీశ్ ఉన్నారు.

ఇసుక రవాణాను మానిటరింగ్ చేయాలి

- ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా
- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 12: జిల్లాలో ఇసుక రవాణాను అధికారులు కట్టుదిట్టంగా మానిట రింగ్ చేయాలని, ప్రత్యేక అధికారులను నియమించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. ఇసుక పాలసీపై హైదరాబాద్ నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీసీలో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీసీపీ ఎం.చేతన పాల్గొన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద తనిఖీలు చేస్తూ ఇసుక అక్రమ రవాణా నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, పేదలు నిర్మించుకునే ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ఇసుక రవాణా వాహనాలకు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఇసుక రీచ్‌ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అవసరమైన కెమెరాలు ఏర్పాటు, స్టాక్ యార్డుల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీసీలో మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ , ఆర్డీవో రంగారావు, మంథని ఆర్డీవో సురేష్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి(మొరం) తరలింపును అడ్డుకోండి

వినతి పత్రం ఇస్తున్న పాలితం గ్రామస్తులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12: పాలితం గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ భూమి నుంచి అనుమతులు ఉన్నాయనే పేరుతో ప్రతి నిత్యం వందలాది ట్రిప్పులుగా మట్టి(మొరం) రవాణా జరుగుతందని ఆరోపిస్తూ గ్రామస్తులు బుధవారం పెద్దపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ రాజయ్యకు పలు డిమాండ్‌లతో కూడిన పత్రాన్ని అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాపులపల్లి రోడ్డుకు మట్టి రవాణా జరుగుతుండడంతో తమ గ్రామ అవసరాలకు మట్టి లేకుండా పోతుందని, ఇక్కడి నుంచి ఎవరూ మట్టి తరలించడానికి వీలు లేదని, ఎవరూ కూడా గుట్ట బోరును వాడుకోకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తాము వాహనాలను అడ్డుకుంటే పోలీసులు జోక్యం చేసుకుని అది రెవెన్యూ అధికారులు చూసుకుంటారని మీకేం అభ్యంతరం అంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే ఆర్ఐ భానుకుమార్‌ను పంపించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్ఐ గ్రామానికి చేరుకుని మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనుమతులు పొందే వరకు ఎవరు కూడా మట్టి రవాణా చేయొద్దని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనగామ రాజేశం,తోట సంపత్ పటేల్, గంగాధరి చంద్రమౌళి, అట్ల హరీష్, కారం కృష్ణ, కారం కనుకయ్య, వెలిచాల సంపత్, తోట తిరుపతి, బట్టల అనిల్, పుట్ట రమణయ్య, సట్టు సాయి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం

చెత్త తొలగిస్తున్న మున్సిపల సిబ్బంది

పెద్దపల్లి, ఫిబ్రవరి12: చెత్త, ప్లాస్టిక్ రహిత పెద్దపల్లిగా తీర్చిదిద్దేందుకు ప్రజలు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ 2024 -25 కార్యక్రమంలో భాగంగా బుధవారం మినీ ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ గుండమ్మ చెరువు పై స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ ట్యాంక్ బండ్‌పై ఉన్న చెత్త, నీటిలోని ప్లాస్టిక్ వస్తువులు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు .చెత్త, ప్లాస్టిక్ రహితంగా పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. తడి పొడి చెత్తగా వేరుచేసి మీ వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. మినీ ట్యాంక్ బండ్ పై సాయంత్రం వేళ వచ్చే సందర్శకులు, పట్టణ ప్రజలు ఇంట్లో నుంచి పూజ సామగ్రి, ప్లాస్టిక్ కవర్లు తీసుకువచ్చి చెరువులో వేస్తున్నారని పేర్కొన్నారు. మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, వార్డ్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సిలింగ్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 12: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో గత నాలుగు నెలోల అమ్మాయిలను వేధింపులకు గురిచేసి షీటీమ్‌కు పట్టుబడిన ఈవ్ టీజర్స్(ఆకతాయిలు)కు బుధవారం కమిషనరేట్ పరిధి ఉన్నతాధికారులు జూమ్ మీటింగ్ ద్వార ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. మహిళల పట్ల ప్రవర్తించాల్సిన తీరు. అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే చట్ట ప్రకారం శిక్షలకు గురవుతారని, బాధ్యతగల పౌరులుగా జీవించాలని అవగాహన కల్పించారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, జిల్లా షీటీమ్ ఎస్ఐ ఎం లావణ్య, కమిషనరేట్ పరిధిలోని షీటీమ్ సభ్యులు ఉన్నారు.

ఓబీ కంపెనీ కార్మికుడి ఆత్మాహత్య యత్నం

రామగిరి ఫిబ్రవరి 12 : ఆర్జీ -3 డివిజన్‌లోని ఓసీపీ -2 ప్రాజెక్ట్‌లోని ఓబీ పనులు నిర్వహించే సీ-5లో కాంట్రాక్ట్ కంపెనీలో డ్రైవర్ గా పనిచేసే లద్నాపూర్ గ్రామానికి చెందిన డేగ నరేష్ అనే వ్యక్తి బుధవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఉదయం షిఫ్ట్ లో విధుల్లో భాగంగా డంపర్ -7 వాహనాన్ని డంపింగ్ ప్రదేశం లో ఒక ప్రక్కన నిలిపి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తోటి డ్రైవర్లు గమనించి యాజమాన్యనికి తెలిపారు. హుటాహుటిన సెంటినరీకాలనీలోని డిస్పెన్సరీకి తరలించారు. అక్కడ నుంచి గోదావరిఖనిలోని ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

కాగా కాంట్రాక్టు డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు కంపెనీ పని ఒత్తిడా లేక వ్యక్తిగత సమస్యలు ఉన్నాయా తేలాల్సి ఉంది. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

ఆర్జీ-1లో అధికారుల క్వార్టర్ల కౌన్సిలింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 12: సింగరేణి ఆర్జీ-1 పరిధిలో విధు నిర్వహిస్తున్న అధికారులకు బుధవారం స్థానిక జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ వద్ద క్వార్టర్ కౌన్సిలింగ్ జరిగింది. కౌన్సిలింగ్‌లో ఎన్,సీఎ,బీ,ఓల్డ్ బీసీ టైప్ క్వార్టకు నిర్వహించిన కౌన్సిలింగ్‌కు 30 మంది కార్మికులు దరఖాస్తులు చేసుకున్నప్పటికి అర్హత గల వారి క్వార్టర్లను పారదర్శకంగా అధికారుల సమక్షంలో కేటాయించినట్లు యాజమాన్యం పేర్కొంది. ఇక్కడ ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియన్ పీవో హన్మంతరావు, అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి: ఈ నెల27న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాల్వశ్రీరాంపూర్-ఓదెల సెక్టోరియల్ అధికారి, తహసీల్దార్ పీ జగదీశ్వర్‌రావు తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కాల్వశ్రీరాంపూర్‌లో 1538 పట్టభద్రులు, 21 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సన్నాహాలు

జూలపల్లి, ఫిబ్రవరి 12 : స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు మొదలపెట్టారు. ఈ క్రమంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు డ్రాప్టు పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురించారు. పోలింగ్ స్టేషన్ల జాబితాల అభ్యంతరాల పై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో పద్మజ పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

VEHICLE FOR SALE

★Maruthi Swift VXI BSVI-2023, Model: Veh No: TS23 G1114, Contact: INDUSIND Bank. Cell: 99593 45748. NTK-0000

CHANGE OF NAME

★Aeguri Bhagya Laxmi, W/o. Ramesh, D/o. Yellaiah (Old Name) H.No. 8-2-25, Bhavaninagar, Vemulawada Town & Mandal, Rajanna Sircilla Dist. have my Name was changed to ANUGULA LAHARI W/o. RAMESH (New Name) NTK-00000

GOLD FINANCE

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్. NT-337308

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీత